క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శ్రీకాళహస్తి: 33/11కేవీ సబ్‌స్టేషన్లు, లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు తిరుపతి రూరల్ ఈఈ వాసురెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణం, శ్రీకాళహస్తి రూరల్, కేవీబీపురం, బుచ్చినాయుడుకండ్రిగ, ఏర్పేడు, తొట్టంబేడు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా కట్ చేస్తున్నట్టు తెలియజేశారు.

సత్యవేడు: కాళమనాయుడుపేట, దాసుకుప్పం సబ్‌స్టేషన్లలో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏడీఏ చంద్రనాయక్ తెలిపారు.

పిచ్చాటూరులో..

పిచ్చాటూరు: శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఇన్‌చార్జ్ ఏఈ రవి తెలిపారు. మండలంలోని విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల పనుల దృష్ట్యా కరెంట్ కట్ చేస్తున్నట్టు చెప్పారు.

మండల సమావేశం వాయిదా

సత్యవేడు: ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి అమలులో ఉన్న కారణంగా శుక్రవారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీఓ బాలగణేశ్ తెలిపారు.

డిప్యూటీ తహసీల్దారుగా శివయ్య



బుచ్చినాయుడుకండ్రిగ: డిప్యూటీ తహసీల్దారుగా జి.శివయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న డీటీ శ్రీనివాసులు ఉద్యోగోన్నతిపై బాలయపల్లెకు తహసీల్దారుగా వెళ్లారు. దీంతో కలెక్టర్ కార్యాలయం నుంచి శివయ్యను ఇక్కడికి బదిలీ చేశారు. భూసమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆయన తెలిపారు.

ముక్కంటి సేవలో ఎంపీ బొత్స ఝాన్సీ



ధ్వజస్తంభం వద్ద బొత్స ఝాన్సీ

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి విజయనగరం ఎంపీ బొత్స ఝాన్సీ దర్శించుకున్నారు. ఆలయదక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లుచేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ముక్కంటి సేవలో కేరళ ఎమ్మెల్యే



ఆలయ ధ్వజస్తంభం వద్ద కేరళ ఎమ్మెల్యే చెణితల రమేష్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం కేరళ ఎమ్మెల్యే చెణితల రమేష్ దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపుర వద్ద ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వదించారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఉయ్యాల సేవలో పద్మావతీ అమ్మవారు



ఉయ్యాలసేవలో పద్మావతీ అమ్మవారు

నారాయణవనం: పద్మావతీ సమేత వెంకన్న ఆలయంలో శుక్రవారం సాయంత్రం పద్మావతీ అమ్మవారికి గంట పాటు ఉయ్యాల సేవ నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవలో మేల్కొన్న స్వామికి నిత్య పూజా కైంకర్యాలలో భాగంగా తోమాల, శుద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. 7 గంటలకు వెంకన్నకు, పద్మావతీ అమ్మవార్లకు శుక్రవార అభిషేకాలను నిర్వహించారు. సాయంత్రం పూజల అనంతరం తిరుచ్చి వాహనాన్ని అధిరోహించిన పద్మావతీ అమ్మవారు ఆలయ ప్రాకారంలో ఊరేగారు. ఉయ్యాలసేవను వీక్షించిన భక్తులు తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

వైభవంగా కుంభాభిషేకం



ఆలయ ప్రాంగణంలో కలశాల ఊరేగింపులో రిత్వికులు



విమాన గోపురానికి కుంభాభిషేకం నిర్వహిస్తున్న రిత్వికులు

నారాయణవనం: మండలంలోని సముదాయంలోని టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వామి ఆలయ అష్టబంధన మహా కుంభాభిషేకాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ జీర్ణోద్ధరణ పూర్తి కావడంతో శైవాగమం ప్రకారం సోమవారం నుంచి అష్టబంధన, మహా కుంభాభిషేక కార్యక్రమాన్ని ఆలయ యాగశాలలో ప్రారంభమయ్యాయి. చివరి రోజైన శుక్రవారం ఉదయం ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను, 6.30 గంటలకు యాగశాలలో హోమాలు పూర్తి చేశారు. పూర్ణాహుతి అనంతరం 9.45 గంటలకు రాజ, విమాన గోపురాలపై కలశాలను హోమ ద్రవ్యాలు, పవిత్ర జలాలతో అభిషేకించారు. అనంతరం ఆలయ సంపెంగ ప్రాకారంలో నిర్మించిన ఆలయాలలోని పరివార దేవతలకు, మరగదవల్లీ సమేత అగస్తీశ్వరస్వాములకు అభిషేకాలను నిర్వహించి ధూప,దీప నైవేద్యాలను సమర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం నిత్యపూజాది కార్యక్రమాలను అందుకున్న ఉత్సవమూర్తులు వృషభ వాహనాన్ని అధిరోహించి వీధుల్లో విహరించారు. ఏర్పాట్లను టీటీడీ స్థానిక ఆలయాల డిప్యూటీ ఈఓ నాగరత్న, సూపరింటెండెంట్ ఏకాంబరం, ఆలయ అధికారి నాగరాజు, అర్జితం అధికారి భరత్, షరాబ్ షనాయ్, భద్రతా జమేదార్ విజయకుమార్ పర్యవేక్షించారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



బాల్య వివాహాలపై నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ



ఏర్పేడు : ర్యాలీ చేస్తున్న సర్పంచ్ మోహనప్రియ, ప్రగతి సంస్థ ప్రతినిధులు



తొట్టంబేడు : గుండేలుగుంట జెడ్పీ హైస్కూలులో..

బుచ్చినాయుడుకండ్రిగ: బాల్య వివాహాలపై శుక్రవారం స్థానిక లక్ష్మీపురం గిరిజన కాలనీలో ప్రజా ప్రగతి ట్రస్ట్, మహిళా పోలీసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ట్రస్ట్ కో-ఆర్డినేటర్ సుబ్రమణ్యం, మహిళా పోలీస్ కాంచన మాట్లాడారు. బాల్య వివాహాలను అడ్డుకట్ట వేయాలన్నారు. అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు పూర్తయిన తర్వాతే వివాహం చేయాలన్నారు. బాల్యవివాహాలు చేసినా, ప్రోత్సహించినా చట్టరీత్యానేరమని, జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేష్, ట్రస్ట్ సభ్యులు రాజారావు, ఓంకారం, వలంటీర్ చెంచయ్య పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ కృషిచేయాలి..

ఏర్పేడు: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సర్పంచ్ మోహనప్రియ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎండీ పుత్తూరులో ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ చిన్నతనంలో వివాహాలు చేస్తే మానసిక రుగ్మతలకు గురవుతారన్నారు. బాల్యవివాహాలు చేస్తే రూ.లక్ష జరిమానా విధిస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పద్మమ్మ, ప్రగతి సంస్థ పాపానాయుడుపేట క్లస్టర్ కన్వీనర్ సుబోస్, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి ప్రియదర్శిని, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్త విమలకుమారి, ఆశా వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

తొట్టంబేడులో..

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): బాల్య వివాహాల నిర్మూలనపై శుక్రవారం మండలంలోని గుండేలుగుంట జెడ్పీ హైస్కూలులో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి కార్యదర్శి ఆనంద్‌బాబు మాట్లాడారు. కార్యక్రమంలో చోడవరం సర్పంచ్ వెంకటరమణారెడ్డి, మహిళా పోలీస్ త్రివేణి, హై స్కూల్ ఉపాధ్యాయులు, ఎంఎల్‌హెచ్‌పీ యువశ్రీ, ఏఎస్ఎం వరలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణులవ్వాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ రవీంద్రనాథ్

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక ఎస్సీ, బీసీ బాలుర, ఎస్సీ బాలిక హాస్టల్ విద్యార్థులు త్వరలో జరగనున్న 10వ తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఎంఈఓ రవీంద్రనాథ్ అన్నారు. శుక్రవారం ఆయన ఎస్సీ, బీసీ బాలుర హాస్టల్స్‌ను తనిఖీ చేశారు. ఎస్సీ బాలుర హాస్టల్‌లో హాజరు పట్టిక ఉన్నంత మంది విద్యార్థులు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం విద్యార్థుల చదువుల కోసం కోట్లాది రూపాయలను ఖర్చు చేస్తోందన్నారు. ప్రణాళిక బద్ధంగా చదివి 100 శాతం ఉత్తీర్ణతతో పాటు మంచి మార్కులు సాధించేలా చూడాలని వార్డన్లకు సూచించారు.

ఉపాధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ గిడ్డయ్య

ఏర్పేడు: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ గిడ్డయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని అంజిమేడులో చేస్తున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. రోజుకు రూ.257 వేతనం వస్తోందా, లేదా? అని కూలీలను ఆరా తీశారు. మార్చి 31 నాటికి ప్రతి కుటుంబానికి వంద రోజుల పనులు పూర్తి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రైతుల పొలాల్లో మామిడి, పూలు, మునగ తోటలను పెంచాలని సూచించారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకురాలు గీతాంజలి పాల్గొన్నారు.

లోక్ అదాలత్ బెంచ్ అధ్యక్షుడిగా జడ్జి పవన్‌కుమార్

తిరుపతి లీగల్ : సత్యవేడు కోర్టులో శనివారం జరగనున్న జాతీయ లోక్ అదాలత్ బెంచ్ అధ్యక్షుడిగా తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పవన్‌కుమార్‌ను నియమిస్తూ జిల్లా జడ్జి భీమారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సత్యవేడు కోర్టులో జరగనున్న లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం, ఇతర బాధ్యతలను జడ్జి పవన్‌కుమార్ పర్యవేక్షించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

తుడా నిధులతో పార్క్‌గా గుంటకట్ట అభివృద్ధి



రేణిగుంటలో గుంటకట్టను పరిశీలిస్తున్న తుడా కార్యదర్శి లక్ష్మి, బియ్యపు పవిత్రారెడ్డి

రేణిగుంట: పట్టణ నడిబొడ్డున ఉన్న గుంటకట్టను తుడా నిధులతో పార్క్, సుందరీకరణ పనులతో పట్టణ ప్రజలకు ఆహ్లాద ప్రదేశంగా తీర్చిదిద్దనున్నట్టు అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. రేణిగుంట గుంటకట్ట ప్రాంతాన్ని శుభ్రం చేసి అభివృద్ధి చేయాలని స్థానికులు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో శుక్రవారం గుంటకట్టను తుడా కార్యదర్శి లక్ష్మితో పాటు ప్రజాప్రతినిధులు పరిశీలించారు. చారిత్రక ప్రాశస్త్యం కలిగిన గుంట కట్ట సుందరీకరణ పనులు త్వరలోనే ప్రారంభించి పార్క్, వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసి అన్ని వయస్కుల వారిని ఆకర్షించేలా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బియ్యపు పవిత్రారెడ్డి, ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుజాత, సర్పంచ్ నగేషం, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, కో-ఆప్షన్ సభ్యుడు సుభాన్‌రాజ, ఎంపీడీఓ హరిబాబు, రహీం, ఉప సర్పంచ్ ఇర్ఫాన్, ఎంపీటీసీ శశికిరణ్, రేణిగుంట ఈఓ విజయభాస్కర్ పాల్గొన్నారు.

మూషిక వాహనంపై గణనాథుని కటాక్షం

- ఉదయం గ్రామ దేవత పొన్నెమ్మకు పూజలు
- నేటి నుంచి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు



మూషిక వాహన సేవలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటుపల్లె శ్రీపళ్లికొండేశ్వరాలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం సాయంత్రం మూషిక వాహనంపై వినాయకుడు భక్తులను కటాక్షించారు. విఘ్న వినాయకస్వామి ఉత్సవమూర్తిని పలు రకాల పుష్పాలతో ప్రధాన అర్చకులు కార్తికేయ గురుక్కళ్ అందంగా అలంకరించి, మూషిక వాహనంపై అధిష్టించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు నడుమ గోమాత ముందు వెళ్లగా స్వామివారిని గ్రామంలో ఊరేగించారు. ఉభయదారులుగా సురుటుపల్లె ప్రజలు వ్యవహరించారు. తొలుత ఉదయం గ్రామదేవత పొన్నెమ్మకు సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. ఏర్పాట్లను ఈఓ రామచంద్రారెడ్డి, ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, సభ్యులు, ఆనందుడు, ఎస్ఎం సురేష్, చిత్ర, సత్య, మునివేలు పర్యవేక్షించారు. ప్రత్యేక ఆహ్వానితులు రాధాక్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి వాహన సేవలు

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీపళ్లికొండేశ్వరాలయంలో శనివారం నుంచి 10 రోజుల పాటు నిత్యం వాహన సేవలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ తెలిపారు. శనివారం పల్లకి సేవ, ఆదివారం చంద్రప్రభ వాహనం, సోమవారం కామధేను వాహనం, మంగళవారం భూతవాహనం, బుధవారం అధికార నంది వాహనం, గురువారం గజ వాహనం, శుక్రవారం అశ్వవాహనం, శనివారం వృషభ వాహనం, ఆదివారం కల్పవృక్ష వాహనంపై స్వామివారు భక్తులను అనుగ్రహిస్తారని, సోమవారం రావణబ్రహ్మ, త్రిశూలస్నానంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయని చెప్పారు. బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని పళ్లికొండేశ్వరాలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ గోడలకు అమర్చిన విద్యుత్ దీప తోరణాలు, దేవతామూర్తుల విద్యుత్ కటౌట్‌లతో కొత్త సొబగులు అద్దుకుంది.

మూషిక వాహన సేవలో ఎమ్మెల్యే

సురుటుపల్లి శ్రీపళ్లికొండేశ్వరాలయంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన గణనాథుని మూషిక వాహన సేవలో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు.





విద్యుద్దీప కాంతులతో శోభాయమానంగా వెలుగుతున్న పళ్లికొండేశ్వరాలయం

ప్రతి సమస్యనూ పరిష్కరిస్తాం



వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఆదిమూలం, ప్రజాప్రతినిధులు

–ఎమ్మెల్యే ఆదిమూలం

కేవీబీపురం : ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండలంలోని రాయపేడు సచివాలయ పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ప్రతి కుటుంబంతో మాట్లాడారు. నవరత్న పథకాల రూపేణా గ్రామంలోని సుమారు 340 కుటుంబాలు పొందిన లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు.

వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

వగత్తూరులో సుమారు రూ.18 లక్షలతో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. క్లినిక్‌లో సదుపాయాలను పరిశీలించారు. వైద్యసిబ్బందితో మాట్లాడారు. ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందివ్వాలని సూచించారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

వగత్తూరు సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజల నుంచి సమస్యలపై వినతులను ఎమ్మెల్యే స్వీకరించారు. తన దృష్టికి ప్రజలు నివేదించిన సమస్యలను సంబంధించి అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం గ్రామ దళిత, గిరిజనవాడల్లో జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలను ఎమ్మెల్యే పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణాలను పూర్తిచేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాటమ్మ, పార్టీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు మునెమ్మ, ఎంపీపీ మునిలక్ష్మి, నందకుమార్, నాయకులు, లాల్‌బాబు యాదవ్, వెంకటరత్నం, ఎంపీటీసీలు మూర్తి సుబ్బన్న, మోహన్ నాయుడు, ముదిరాజ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ధనుంజయరెడ్డి, తహసీల్దార్ ద్వారకనాథ్ రెడ్డి, ఎంపీడీఓ రామచంద్ర, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

స్టిక్కర్ కిట్లను సచివాలయ కన్వీనర్లకు చేరవేయాలి

పిచ్చాటూరు: శనివారం 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్ కిట్లను అన్ని సచివాలయ కన్వీనర్లకు చేరవేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆయన పిచ్చాటూరులో విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం మండల కన్వీనర్లు, సచివాలయ మండల కన్వీనర్లకు స్టిక్కర్ల కిట్లను చేరవేసిందన్నారు. వాటిని శనివారం తమ మండల పరిధిలోని అన్ని సచివాలయ కన్వీనర్లకు చేరవేయాల్సిన బాధ్యత సచివాలయ మండల కన్వీనర్లు తీసుకోవాలని, వారికి మండల కన్వీనర్లు సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ కోసం గదిని పరిశీలిస్తున్న మండల ఎన్నికల ఉప అధికారి శివయ్య

బుచ్చినాయుడుకండ్రిగ: వచ్చే నెల 13న నిర్వహించనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను శుక్రవారం మండల ఎన్నికల ఉప అధికారి, డిప్యూటీ తహసీల్దార్ శివయ్య పరిశీలించారు. గదులకు విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం ఉందా, లేదా? అని పరిశీలించామని, పోలింగ్ బూత్ గదుల వివరాలను జిల్లా ఎన్నికల అధికారులకు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటసుబ్బయ్య, వీఆర్ఓ ప్రసాద్, ఉప సర్పంచ్ మునిరాజా పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరానికి స్పందన



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

శ్రీకాళహస్తి: స్థానిక బహదూరుపేటలోని నల్లగంగమ్మ ఆలయ ఆవరణలో శుక్రవారం రాస్, టాటా ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. శిబిరంలో 157మంది వైద్యపరీక్షలు చేయించుకున్నారు. నోరు, రొమ్ము, గర్భాశయ కాన్సర్, బీపీ, హెపటైటిస్, మధుమేహం పరీక్షలు చేసి సలహాలు-సూచనలు ఇచ్చారు. ఆలయ చైర్మన్ కంఠా రమేష్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం అభినందనీయమని నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రాథమికంగా క్యాన్సర్‌ను గుర్తిస్తే నివారించకోవచ్చన్నారు. యూనియన్ బ్యాంకు మేనేజర్ హరికృష్ణ, డిప్యూటీ మేనేజర్ కిషోర్, రీజినల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ శుభం, ఆలయ కమిటీ సభ్యులు పూల కృష్ణమూర్తి, వైద్యులు భార్గవ్, చైతన్య, టాటా ట్రస్ట్ కో-ఆర్డినేటర్ హేమంత్, రెడ్డికుమారి పాల్గొన్నారు.

శ్రీకాళహస్తికి అడిషనల్ జిల్లా కోర్టు



హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణానికి అడిషనల్ జిల్లా కోర్టు గెజిట్ నోటిఫికేషన్ శుక్రవారం విడుదలైంది. దీనిపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాడుపూరు ప్రసాద్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో శ్రీకాళహస్తి, చుట్టుపక్కల మండలాల ప్రజలందరూ అడిషనల్ జిల్లా కోర్టును ఉపయోగించుకుంటారని తెలిపారు. లా సెక్రటరీ, లా సెక్రటరీ పీఏ, జిల్లా న్యాయమూర్తులు, రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న ధూర్జటి కళాప్రాంగణం



ధూర్జటి కళాప్రాంగణం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13 నుంచి ప్రారంభం కానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు పాలక మండలి, ఆలయ అధికారులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీ. దీనికి సంబంధించి జలవినాయకస్వామి సమీపంలో ధూర్జటి కళాప్రాంగణాన్ని ప్రతిమలను తీర్చిదిద్దుతూ మరింత ఆకర్షణీయంగా ముస్తాబు చేస్తున్నారు. మరో రెండు రోజుల్లో ధూర్జటి కళాప్రాంగణం సిద్ధం కానుంది.